క్లుప్తంగా

15వ వార్డులో క్షయ నిర్ధారణ శిబిరం



వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎల్ఏటీవో డాక్టర్.రోణంకి రమేష్ బృందం

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో సింహాద్రిపురం కాలనీ, దుర్గానగర్ కాలనీలో మద్దిలపాలెం పట్టణ ఆరోగ్యకేంద్రం డాక్టర్. రెహినిసా ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ నిర్ధారణ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎల్ ఏటీవో డాక్టర్ రోణంకి రమేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్షయ రహిత భారతదేశం ప్రచారంలో భాగంగా వార్డులో ప్రత్యేక క్షయ నిర్ధారణ, అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ రెహినిసా మాట్లాడుతూ వారంపైబడి దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే క్షయ నిర్ధారణ పరీక్ష చేసుకోవాలని సూచించారు. త్వరితగతిన రోగ నిర్ధారణతో పాటు, మెరుగైన వైద్య చికిత్స పొందాలని సూచించారు. శిబిరంలో టీబీ వైద్య సిబ్బంది హాజరయ్యారు.

సన్‌ఫ్లవర్ స్కూల్‌కు బస్సు అందజేత



బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ భరత్ తదితరులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డ్ రామలక్ష్మి అపార్ట్‌మెంట్ దరి సన్‌ఫ్లవర్ ప్రత్యేక బాలల పాఠశాలకు నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) ఆధ్వర్యంలో బస్సును విరాళంగా అందజేశారు. మంగళవారం పాఠశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని దివ్యాంగ విద్యార్థులతో కలిసి బస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాలల అవసరాల కోసం రూ.20 లక్షల బస్సును విరాళంగా అందించిన నాట్స్ సంస్థను ప్రశంసించారు. గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్స్ సెక్షన్ కార్యదర్శి వెంకన్న చౌదరి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటుకు పరిశీలన



పరిశీలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వార్డులో వీధి లైట్ల సమస్యపై కార్పొరేటర్ పల్లా అప్పలకొండ కౌన్సిల్‌లో ప్రస్తావించటంతో, జీవీఎంసీ అధికారులు స్పందించారు. మంగళవారం జీవీఎంసీ సిబ్బంది వార్డులో ఎక్కడెక్కడ విద్యుత్ దీపాలు లేవో వచ్చి పరిశీలించారు. సుమారు 60 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని గుర్తించారు. రెండు మూడు రోజుల్లో ఈ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన సమాచార శాఖ డీడీ



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సమాచార శాఖ డీడీ సదారావు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ కార్యాలయ ఉప సంచాలకులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. సదారావు మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ల వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై సదారావుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమన్వయంతో వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో పని చేసుకోవాలని సూచించారు.

ఫోర్జరీ పట్టాలతో బిల్డింగ్ ప్లాన్

• దర్జాగా నిర్మాణం • పట్టించుకోని అధికారగణం



ఫోర్జరీ పట్టాలతో ప్లాన్ తీసుకుని చేపడుతున్న భవన నిర్మాణం

ఆరిలోవ: అనధికారిక నిర్మాణాలు, ఆక్రమిత స్థలంలో కట్టడాలు ఆరిలోవ ప్రాంతంలో కోకొల్లలుగా జరుగుతున్నాయి. అధికారులను, రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకుని దొడ్డిదారిన అలాంటి నిర్మాణాలు చేపడుతున్నారు. వీటికి తోడు ఓ వ్యక్తి ఏకంగా దొంగ పట్టాలు సృష్టించి భవనం నిర్మాణం చేపట్టడం విస్మయాన్ని కలిగిస్తోంది. రెవెన్యూ అధికారులు, జీవీఎంసీ జోన్–2 టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయంలో సంబంధిత సిబ్బంది సహకారం అందించడంతో సదరు వ్యక్తి దర్జాగా నిర్మాణం జరిపించేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి పార్వతినగర్‌లో సుమారు 158 చదరపు గజాల విస్తీర్ణంలో ఓ వ్యక్తి మూడు ఫ్లోర్లకు పట్టణ ప్రణాళిక అధికారుల నుంచి ప్లాన్ పొందాడు. ప్లానింగ్ అధికారులకు రెండు ఇంటి నంబర్లతో కూడిన పట్టాలు జతచేసి ఆ ప్లాన్ పొందాడు. సుమారు 8 అడుగుల వెడల్పు గల ఇరుకు రోడ్డు పక్కన చేపడుతున్న ఆ భవణ నిర్మాణంలో అండర్‌గ్రౌండ్ కూడా అనధికారికంగా భాగం చేసేశాడు. టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా ప్లాన్ మంజూరు చేసిన అనంతరం ఆ నిర్మాణం ఎలా జరుగుతుందో పరిశీలించకపోవడం గమనార్హం.

ఇదంతా ఒక ఎత్తయితే దొంగ పట్టాల ద్వారా ప్లాన్ సంపాదించడం విశేషం. ఈ ప్రాంతంలో కొందరికి 2000 సంవత్సరం కంటే ముందు పట్టాలు మంజూరు చేశారు. ఆ తర్వాత కాలంలో రెవెన్యూ అధికారులు ఎవరికీ పట్టాలు జారీ చేయలేదు. ఇక్కడ అసలు ట్విస్ట్ ఏంటంటే.. దొంగ పట్టాలతో ఈ నిర్మాణానికి ప్లాన్ పొందడమే. ఇక్కడ బాలసాని స్వర్ణ పేరుతో ఇంటి నంబరు 13–718/1, బాలసాని వెంకటరావు పేరుతో ఇంటి నంబరు 13–718/2 తో 60 చదరపు గజాల చొప్పున రెండు పట్టాలను మే 15, 2002లో చినగదిలి(రూరల్ మండలం) రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేసినట్లు ప్లాన్‌కు జతచేశారు. సుమారు మరో 38 చదరపు గజాల స్థలానికి చంద్రన్న పట్టా ఉంది. చంద్రన్న పట్టా ఉన్న 38 చదరపు గజాలకే ఇది అధికారికం. మిగిలిన 120 చదరపు గజాల స్థలానికి సంబంధించిన రెండు పట్టాలు కూడా ఫోర్జరీ సంతకాలతో సృష్టించినవేనని రెవెన్యూ అధికారులు తేటతెల్లం చేశారు.

ఆయా పట్టాల ద్వారా జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు సదరు భవన నిర్మాణదారుడికి ప్లాన్ మంజూరు చేసేశారు. నిజానికి 2000 సంవత్సరం తర్వాత ఎలాంటి ఇంటి పట్టాలను ఆరిలోవ ప్రాంతంలో ఎవరికీ మంజూరు చేయలేదని రెవెన్యూ అధికారులు తేల్చి చెప్పేస్తున్నారు. ఎవరి వద్దయినా 2000 సంవత్సరం తర్వాత జారీచేసినట్లు ఇళ్ల పట్టాలు ఉంటే అవి అధికారులు ద్వారా ఇచ్చినవి కాదని స్పష్టం చేస్తున్నారు.

ఇక్కడ 2002 లో జారీ చేసినట్లు చూపుతూ జత చేసిన పట్టాల ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ మంజూరు చేయడం, రెవెన్యూ అధికారులు కూడా దొంగ పట్టాలపై చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఇంటి స్థలాల మార్కెట్ ధరను బట్టి సుమారు రూ.కోటి విలువైన స్థలం దొంగ పట్టాల ద్వారా సొంతం చేసుకున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు..

ఆరిలోవ ప్రాంతంలో దొంగ పట్టాలు సృష్టిస్తున్నవారు కొందరు ఉన్నట్లు అధికారులు దృష్టికి వెళ్లింది. అధికారులు వారిపై నిఘా పెట్టినట్లు తెలిసింది. గతంలో వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు, గెడ్డలు అంచులు, రోడ్డు అంచు భాగాలు, వివాదాస్పదంగా మారిన ఖాళీ స్థలాలను వీరు ఎంచుకుంటున్నారు. స్టాంపులు తయారు చేసుకుని అధికారులకు సంతకాలను ఫోర్జరీ చేసి దొంగ పట్టాలు తయారు చేస్తున్నట్లు సమాచారం. అలాంటి స్థలాలను తక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. అధికారుల దృష్టికి వెళ్తే ప్రజా ప్రతినిధులతో ఒత్తిడి తీసుకువచ్చి, అధికారులను అటువైపు వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇటీవల రవీంద్రనగర్‌లో ఓ సంఘానికి చెందిన స్థలం, బాలాజీనగర్‌లో గెడ్డ అంచున ఖాళీ స్థలాలకు కూడా దొంగ పట్టాలు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆ రెండూ ఫోర్జరీ సంతకాలు చేసిన పట్టాలే..

పార్వతినగర్‌లో 13–718/1, 13–718/2 ఇంటి నంబర్లతో పట్టాలు రెండూ రెవెన్యూ అధికారులు జారీ చేసినవి కాదు. అవి ఫోర్జరీ పట్టాలు. అధికారుల సంతకాలు ఎవరో పెట్టేసి పట్టాలు సృష్టించారు. ఆరిలోవ ప్రాంతంలో ఎక్కడా 2000 సంవత్సరం తర్వాత పట్టాలు మంజూరు కాలేదు. ఆయా పట్టాలు 2002, మే నెలలో రెవెన్యూ అధికారులు జారీ చేసినట్లు ఉన్నాయి. ఈ నిర్మాణం జరుగుతున్న విషయం మాకు తెలియదు.

– సత్యం దొర, వీఆర్వో, ఆరిలోవ, చినగదిలి మండలం

అస్తవ్యస్తంగా రాతి శిల్పాల పార్కు

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై రాతి శిల్పాల పార్కు వ్యర్థాలు, గడ్డితో అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడ వివిధ కళలకు సంబంధించిన శిల్పాలతో పాటు పలువురు కవులు, రాజుల శిల్పాలు కూడా అమర్చారు. వాటిని సందర్శకులు చూడడానికి వీలుగా పాత్‌వేలు ఏర్పాటు చేశారు. ఈ పాత్‌వేలలో మధ్యమధ్య పలకలు ఊడిపోయాయి. కొన్నిచోట్ల పలకల మధ్య ఖాళీలు ఏర్పడ్డాయి. వాటిమధ్య గడ్డి మొలవడంతో పాటు వ్యర్థాలతో అస్తవ్యస్తంగా మారింది. దీంతో సందర్శకులు ఆ శిల్పాలను దగ్గర నుండి చూడలేకపోతున్నారు. కొందరు ఆ పార్కు లోపలికి వెళ్లడమే మానేశారు. అధికారులు స్పందించి రాతి శిల్పాల పార్కును పరిశుభ్రం చేయాలని సందర్శకులు కోరుతున్నారు.



కైలాసగిరి రాతి శిల్పాల పార్కులో పాత్‌వేలపై మొలిచిన గడ్డి

అమ్మవారిని దర్శించుకున్న మాజీ మేయర్



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారిని నగర మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మంగళవారం దర్శించుకున్నారు. గ్రామ కమిటీ సభ్యులు ఆమెకు సాదర స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, వంకర బాబూరావు, కాకర గోవింద్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అవుట్ పోస్టులతో నేర నియంత్రణ

వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ



రైల్వేస్టేషన్ జ్ఞానాపురం అవుట్ గేట్ వద్ద పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ



అవుట్ పోస్టు ప్రారంభించి, స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ

తాటిచెట్లపాలెం: నేర నియంత్రణకు పోలీస్ అవుట్‌పోస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని వెస్ట్ జోన్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ తెలిపారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ అవుట్ గేట్ సమీపంలో కంచరపాలెం పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో నేరాలు నియంత్రించేందుకు పోలీస్ అవుట్ పోస్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ షిఫ్ట్‌ల ప్రకారం రోజూ 9 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సమీర్, రవికుమార్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం వైభవంగా 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది హాజరయ్యారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు



లలితాపీఠంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కర పత్రాలను పీఠంలోని వారాహిదేవి సన్నిధిలో పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం 7కు సహస్రనామార్చన, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ నెల 29(ఆదివారం)న వారాహి హోమం చేయనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తులు, అమ్మవారికి చీర ధరింపదలచిన వారు, ప్రసాద వితరణలో పాల్గొనదలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జూలై 9న అఖిల భారత సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని నగరంలోని అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సమ్మె విజయవంతం కావాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు నష్టం కలిగించే విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను మార్చి, కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే ప్రాథమిక హక్కులను కోల్పోతారని హెచ్చరించారు. కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేలు వేతనం చెల్లించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తొలగించిన 4 వేల మంది ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఎల్ఐసీ, బ్యాంకులు, పోర్టులు, చమురు సంస్థలు, రక్షణ రంగం, అంతరిక్షం, గనులు వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్, తోపుడు బళ్లు, మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ, ఆర్‌పీ, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ వంటి వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా జూన్ 25 నుంచి 30 వరకు కార్మికుల పని ప్రదేశాలు, నివాస ప్రాంతాల వద్ద కరపత్రాల పంపిణీ చేయనున్నారు. జూలై 1 నుంచి 4 వరకు అన్ని పరిశ్రమల వద్ద గేట్ సమావేశాలు నిర్వహిస్తారు. జూలై 5న జీవీఎంసీ నుంచి పలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ, జూలై 7న పారిశ్రామిక ప్రాంతంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. జూలై 9న దొండపర్తి రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ కార్మిక ప్రదర్శన జరపాలని సమావేశంలో నిర్ణయించారు.సమ్మె రోజున యావత్ కార్మిక వర్గం, ఆటో, ఇతర మోటార్ కార్మికులు తమ వాహనాలను నిలిపివేసి బంద్‌కు మద్దతు తెలపాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, సీఎఫ్‌టీయూఐ అఖిల భారత అధ్యక్షుడు ఎన్.కనకారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వేంకటేశ్వర్లు సహా పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పైడిమాంబ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మొల్లి అప్పారావు, స్థానిక నాయకులు



రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారి పండగ ముగింపోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఇక్కడ అమ్మవారి పండగ జరుగుతున్న విషయం తెలిసిందే. ముగింపోత్సవాలు సందర్భంగా రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించారు. అమ్మవారిని పలు రాజకీయ పార్టీల నాయకులు దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేకంగా పూజలు చేయించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, మాజీ మార్కెటింగ్ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యాల వెంకట్, వంకర బాబూరావు, కాకర గోవింద్, జి.విక్టర్, వానపల్లి ఈశ్వరరావు, ఇమంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సు టైరుపేలి ఒకరికి గాయాలు

ఎంవీపీకాలనీ: ఇసుకతోట జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు టైరు పేలడంతో అందులో ప్రయాణిస్తున్న మామిడి వెంకటరావు (45) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తవలసకు చెందిన వెంకటరావు కుటుంబంతో కలిసి ఈ నెల 22న ఆర్టీసీ రూట్ నంబర్ 68కె బస్సులో ఆర్కే బీచ్‌కు బయలుదేరాడు. 4 గంటల సమయంలో బస్సు ఇసుకతోట కూడలికి చేరుకోగా ఒక్కసారి భారీ శబ్దంతో బస్సు టైరు పేలిపోయింది. దీంతో బస్సు టైరుకు సమీపంలోని సీట్లో కూర్చున్న వెంకటరావుకు కొన్ని టైర్ ఇనుప భాగాలు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని బస్సు డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఓమ్ని ఆర్కే ఆసుపత్రికి తరలించగా ఎక్స్‌రేలో అతని ఎడమ కాలు విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో నాణ్యతలేని టైర్లు వాడుతూ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని పేర్కొంటూ వెంకటరావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ బోగస్ విద్యాసంస్థలపై చర్యలకు వినతి



ఆర్ఐవోకు వినతిపత్రం అందిస్తున్న స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ప్రతినిధి

మద్దిలపాలెం: విశాఖ జిల్లాలో గుర్తింపు లేకుండా, అకాడమీల పేరుతో ఇంటర్మీడియట్ బోధిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బోగస్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి కోరారు. ఈమేరకు పిఠాపురం కాలనీలో గల ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో ఆర్ఐవో పిల్లి మురళీధర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరానికి ముందు ఆకర్షణీయ ప్రకటనల ద్వారా బోగస్ విద్యాసంస్థలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాసంవత్సరం పూర్తయ్యే సరికి బోర్డు తిప్పేసి, విద్యార్థులను రోడ్డున పడేట్టు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి బోగస్ కళాశాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వీటిపై నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆర్ఐవో మురళీధర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా నియమితులైన కేతన్ గార్గ్‌ను మంగళవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సతీష్, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం, డిప్యూటీ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్, కోశాధికారి జి.సాగర్ మూర్తి, సహాయ కార్యదర్శి వి.జీవన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని మూసేసి ఫ్లెక్సీ..



రామకృష్ణాపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని మూసేసి టీడీపీ నాయకులు కట్టిన ఫ్లెక్సీ

ఆరిలోవ: టీడీపీ నాయకులు ఎవరినీ వదలడం లేదు. కూటమి పాలనలో సాధారణ ప్రజల మాట ఎలా ఉన్నా మహనీయులను కూడా గౌరవించడం లేదు. వారి ప్రచార ఆర్భాటమే ముఖ్యంగా చేసుకుపోతున్నారు. జీవీఎంసీ పదమూడో వార్డు రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ముగింపు ఉత్సవాలు జరిగాయి. వార్డు టీడీపీ నాయకులు ప్రచారం కోసం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, స్థానిక నాయకుల ఫొటోలతో కూడిన పెద్ద ఫ్లెక్సీని అమ్మవారి గుడి ముందు రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. అంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మూసేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఏకంగా అంబేడ్కర్ విగ్రహాన్ని మూసేయడంతో పాటు ఫ్లెక్సీకి ఒక పక్క సపోర్టుగా కూడా వాడుకున్నారు. పక్కనే బోలెడు స్థలం ఉన్నా అంబేడ్కర్ విగ్రహమే వీరి ఫ్లెక్సీకి సపోర్టుగా కనిపించిందా అంటూ స్థానికులు టీడీపీ నాయకులపై మండిపడుతున్నారు. భారత రాజ్యాంగ నిర్మాతకు వీరిచ్చే గౌరవం, విలువ ఇదేనా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మానసిక రోగికి చికిత్స



యువతిని మానసిక వైద్యశాలలో చేర్పిస్తున్న కేర్ టేకర్

అల్లిపురం: మానసిక సమస్యలతో బాధపడుతున్న హిమోతి అనే పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతిని మంగళవారం ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పది రోజుల క్రితం ఆరిలోవ పోలీసులు ఆదర్శనగర్‌లో హిమోతిని రెస్క్యూ చేసి, ఏయూటీడీ జీవీఎంసీ టి.ఎస్.ఆర్ కాంప్లెక్స్ మహిళల వసతి గృహానికి తరలించారు. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పాటు, మందు లు వాడిస్తున్నప్పటికీ షెల్టర్‌లో తరచూ గొడవ చేస్తుండటంతో, మంగళవారం ఏయూటీడీ సంస్థ కేర్ టేకర్స్ లీలావతి, ప్రభాకర్‌లతో కలిసి ఆమెను ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించారు. హిమోతి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఆమె కుటుంబ సభ్యుల వివరాలు ఆరా తీసి, వారికి అప్పగిస్తామని ప్రగడ వాసు తెలిపారు.